యథేచ్ఛగా రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు

- పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ అధికారులు



వనస్థలిపురం రైతుబజారు వద్ద రోడ్డు వెంబడి వ్యాపారాలు, రోడ్డుపై వాహనాల పార్కింగ్‌లు

వనస్థలిపురం: నగరంలో ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు ఆయా శాఖల ఉన్నతాధికారులు తీవ్ర తర్జన భర్జన పడుతుంటే కింది స్థాయిలోని అధికారులు తమ పరిధిలో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యలపై తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నా అటు జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ, ఇటు ట్రాఫిక్ పోలీసులు గానీ పట్టించుకోవడం లేదు. దీంతో పలు వాణిజ్య ప్రాంతాలలో, ఆలయాల సముదాయాల వద్ద నిత్యం ట్రాఫిక్‌జాంలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- వనస్థలిపురం రైతు బజారు వద్ద నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డు వెంబడి షెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారులు చేసుకుంటున్నారు. అయితే షెడ్లను అంతకంతకూ పెంచుకుంటూ పోతూ రోడ్డు ఆక్రమణలకు పాల్పడటం, దీనికి తోడు అక్కడికి వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి.
- వనస్థలిపురం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆయా షాపుల పరిమితి 60 గజాలే. కానీ షాపుల ముందు మరో 60 గజాల మేర రోడ్డుపైకి రేకుల షెడ్లు వేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అక్కడికి వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.
- వనస్థలిపురంలోని పలు ప్రాంతాలలో పాదచారులు నడవడానికి వీలులేకుండా ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఫుట్‌పాత్‌లపై రేకులషెడ్లు, తడకల షెడ్లు, కంటైనర్ బాక్స్‌లను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. వాటి ముందు వాహనాల పార్కింగ్‌తో రోడ్లు కుంచించుకుపోయి వాహనాలు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి.
- జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల మధ్య సమన్వయం లోపించడంతోనే రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎపుడో ఒకసారి స్పెషల్ డ్రైవ్ పేరున ఆక్రమణల తొలగింపునకు పూనుకునే అధికారులు ఆ తర్వాత ఆ విషయమై పట్టించుకోరని, మళ్లీ యథావిధిగా రోడ్లపైకి ఆక్రమణలు వస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.
- ఇప్పటికైనా సంబంధిత జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, స్థానిక ట్రాఫిక్ పోలీసు అధికారులు పట్టించుకుని రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాలని, వాణిజ్య, వ్యాపార కేంద్రాల వద్ద రోడ్లపై పార్కింగ్‌లను నిరోధించి ట్రాఫిక్ సమస్యలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



వనస్థలిపురం రైతుబజారు వద్ద ఆక్రమణలతో ఇరుకుగా మారిన రోడ్డు



వనస్థలిపురం కాంప్లెక్స్ సమీపంలో మహంకాళి ఆలయం వద్ద ఆక్రమణకు గురైన ఫుట్‌పాత్



వనస్థలిపురం కాంప్లెక్స్‌లో రోడ్డుపైకి వచ్చిన నిర్మాణాలు

ఏజీపీగా స్వాతి నియామకం



ఎల్‌బీనగర్: ఎల్‌బీ నగర్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది స్వాతిని ప్రభుత్వం ఏజీపీగా నియమించింది. హైకోర్టులో నీటి పారుదల శాఖ కేసులను వాదించేందుకు స్వాతిని ఏజీపీగా నియమించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ కళాశాలలో ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేసిన స్వాతి 14 ఏళ్లుగా హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. ఏజీపీగా తనకు అవకాశం ఇచ్చినందుకు ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్ నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో..) టమోటా లోకల్ 9, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 40, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 26, క్యారెట్ 21, దొండ 33, ఆలు 24, ఉల్లి 24, గోకర 40, దోస 19, సొర 9, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 50, అర్వి 45, మునగ 40, చిలగడదుంప 60, బీట్‌రూట్ 21, కీర 21, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 57. ఈ ధరలు శుక్రవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

ఇళ్లల్లోకి మురుగు.. ఫిర్యాదు చేసినా పట్టించుకోరు!



గుంటి జంగయ్యనగర్‌లో ఓ ఇంటిలో చేరిన మురుగునీరు

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్యనగర్‌లో డ్రైనేజీ సమస్యతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ల నుంచి మురుగునీరు లీకవుతూ ఇళ్లల్లోకి చేరుతోందని, దీంతో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేసి పది రోజులవుతున్నా సమస్య అలాగే ఉందని, ఇప్పటికైనా మురుగునీరు ఇళ్లల్లోకి చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వన్ టైం స్కీంను సద్వినియోగం చేసుకోండి: డీసీ

చాదర్‌ఘాట్: ఆస్తి పన్ను బకాయిదారులు ప్రభుత్వం ప్రకటించిన వన్ టైం స్కీం కింద పన్ను బకాయిలు చెల్లించి 90 శాతం అపరాధ రుసుము మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ, మలక్‌పేట సర్కిల్ పరిధిలోని ఆస్తి పన్ను బకాయిదారులకు ఇది చివరి మంచి అవకాశమని అన్నారు. గృహ, వాణిజ్య వినియోగుదారులు అందరికీ ఈ స్కీం వర్తిస్తుందని ఆయన తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించి జీహెచ్‌ఎంసీ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు శ్వేతారెడ్డి



మధుయాష్కీగౌడ్, ప్రకాష్‌గౌడ్‌ల సమక్షంలో కాంగ్రెస్‌లో చేసిన శ్వేతారెడ్డి

నాగోలు: కొత్తపేట డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు దేవిరెడ్డి శ్వేతారెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. గురువారం ఆమె ఏఐసీసీ అధికార ప్రతినిధి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సమక్షంలో ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్వేతారెడ్డికి మధుయాష్కీగౌడ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమెతో పాటు శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వరి, హర్షిత, నిర్మల తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

మలక్‌పేట: జాతీయ సైన్స్ డే సందర్భంగా విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. దిల్‌సుఖ్‌నగర్ శ్రీసాయి డిగ్రీ, పీజీ కాలేజీలో అన్వేష్–2024 పేరుతో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు వివిధ అంశాలపై పోస్టర్, పవర్ పాయింట్ ప్రజంటేషన్, వర్కింగ్, నాన్ వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచార్యులు, హెచ్‌ఓడీలు సుష్మా, కీర్తి, మౌనిక, షర్మిళ, అనురాధ, మంజుల, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఐడియల్ డిగ్రీ,పీజీ కాలేజీలో...

దిల్‌సుఖ్‌నగర్ ఐడియల్ డిగ్రీ అండ్ పీజీ ఉమెన్స్ కాలేజ్‌లో జాతీయ సైన్స్ డేను నిర్వహించారు. నిజాం కాలేజీ ఆర్‌అండ్‌డీ సెల్ డైరెక్టర్, బయోటెక్నాలజీ హెడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. సాంబశివరావు ముఖ్యఅతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మధుసూదన్, డీన్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ సుశీలా రెడ్డి, బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ గాయత్రి, కెమిస్ట్రీ విభాగం సుచిత తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున మాంటిస్సోరీలో...

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ శ్రీనివాసపురం కాలనీలోని నాగార్జున మాంటిస్సోరీ, ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్, కేబుల్ బ్రిడ్జి, వ్యవసాయం ఆధునిక విధానాలు, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే కళా ప్రదర్శనలు, ఇతర నమూనాలు అబ్బుర పరిచాయి. కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి, పాఠశాల డీన్ ఎస్. రాజశేఖర్, సీఏఓ శేషారావు, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దిల్‌సుఖ్‌నగర్ శ్రీ సాయి డిగ్రీ, పీజీ కాలేజీలో...



నాగార్జున పాఠశాలలో..

సాక్షి టెక్నో స్కూల్‌లో..



విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్ నెక్కలపూడి

సాక్షి, హైదరాబాద్: హస్తినాపురం అనుపమనగర్ కాలనీలోని సాక్షి టెక్నో స్కూల్‌లో నేషనల్ సైన్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాదాపూర్‌లోని స్పిన్‌లాంచ్ ఐ.ఐ.టీ అకాడమీ సీఈఓ అనిల్‌కుమార్ నెక్కలపూడి హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టుల నమూనాలను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచే సైన్స్ ప్రాజెక్టులు తయారు చేసేలా ఉత్సుకత పెంపొందించే విధంగా పాఠ్యప్రణాళిక ఉండాలన్నారు. ఐ.ఐ.టి రసాయన శాస్త్ర అధ్యాపకుడు ఎన్.సీహెచ్.రవి మాట్లాడుతూ, కాన్సెప్ట్ లెర్నింగ్‌తో పాటు వాటిని టెక్నికల్ ప్రాజెక్టుగా తయారు చేసే విధంగా విద్యార్థులు అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సాక్షి టెక్నో పాఠశాల డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, అశోక్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి



సీఐను సన్మానించిన శంకర్‌నగర్ వాసులు

చాదర్‌ఘాట్: హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను చాటి చెప్తూ శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులకు ప్రజలంతా సహకరించాలని చాదర్‌ఘాట్ సీఐ సైదులు కోరారు. గురువారం ఆయన చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఓల్డ్‌మలక్‌పేట శంకర్‌నగర్‌కు చెందిన పగిల్ల నర్సింగ్ ఆధ్వర్యంలో పలువురు సీఐకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ మాట్లాడుతూ, గతంలో మాదిరిగానే శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు: వంగ



సేమ్యా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: జీహెచ్‌ఎంసీ ఫుడ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం నిబంధనలను తుంగలో తొక్కి ఆహార పదార్థాలను తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి జనతా ఫుడ్ సేమ్యా తయారీ కేంద్ర నిర్వాహకులను హెచ్చరించారు. జనతా ఫుడ్ పేరిట సుల్తానాఅల్వా కాలనీలో గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న సేమ్యా తయారీ కేంద్రంపై స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన సర్కిల్ అధికారులు, పోలీసులతో కలిసి గురువారం సదరు సేమ్యా తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలను పాతరేసి డ్రైనేజీ పారుతున్న ప్రాంతంలో ఎలాంటి పరిశుభ్రత పాటించకుండా సేమ్యా తయారీ చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని మధుసూదన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కేంద్రాన్ని సీజ్ చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సర్కిల్ శానిటేషన్ డీఈ వెంకటేశ్వర్లు, నాయకులు అవినాష్‌రెడ్డి, బబ్బర్, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

నాగోలు: డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్ కాలనీలోని మల్లికార్జున స్వామి ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా గురువారం ఆలయంలో ఘనంగా ఆంజనేయ నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ, మధుసూదన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం



హయత్‌నగర్‌లోని పరీక్ష కేంద్ర వద్దకు సకాలంలో చేరుకున్న విద్యార్థులు

ఎల్‌బీనగర్: ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 12 గంటలకు ముగిసింది. నిమిషం ఆలస్యమైనా కేంద్రాలకు అనుమతించబోమని అధికారులు పేర్కొనడంతో ఎల్‌బీనగర్ పరిధిలోని సెంటర్ల వద్దకు విద్యార్థులు ఉదయం 8 గంటల లోపే చేరుకున్నారు. పరీక్ష రాసే అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. దీంతో విద్యార్థులు సకాలంలోనే కేంద్రాలకు చేరుకున్నారు. ఎగ్జామ్ సెంటర్లలో మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. పలు పరీక్ష కేంద్రాల్లో స్క్వాడ్ తనిఖీలు చేశాయి.

కాళేశ్వరం యాత్రను విజయవంతం చేయాలి

దిల్‌సుఖ్‌నగర్: ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అతి తక్కువ సమయంలోనే నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరంను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయంగా వాడుకోవడం బాధాకరమని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద శర్మ అన్నారు. గురువారం ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మేడిగడ్డ ఒక్కటే కాదని.. ఈ ప్రాజెక్టు కింద పదుల సంఖ్యలో రిజర్వాయర్లు, వేల కిలో మీటర్ల కాలువలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలన మీద దృష్టి పెట్టకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై వితండవాదానికి దిగుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ఇలాంటి నీచ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన కాళేశ్వరం యాత్రను విజయవంతం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిపిద్దామని పిలుపునిచ్చారు.

ఘనంగా ప్రత్యంగిరాదేవి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అమ్మవారి పూజల్లో పాల్గొన్న ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి



అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి 18 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకం నిర్వహించారు. విశ్వాస్ గ్రూపు గాయత్రి ఫణీందర్ ఆధ్వర్యంలో మహిళచే లలితా విష్ణు సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం యాగ మండపంలో దేవతా హోమాలు, పూజలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, విఠల్‌శర్మ, చాణక్య శర్మ, మునిపల్లె సువర్ణలత, అరుణ, హేమ, సాయికుమార్, హేమంత్, గోపాలకృష్ణ, శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠమహోత్సవ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ పెద్దలు

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని ఆదిత్యానగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సంతోషికుమారి తెలిపారు.ఆలయ ప్రాంగణంలో గురువారం వైదిక ఆగమశాస్త్ర పండితులు డాక్టర్ నమిలికొండ శ్రీధరచార్యులు, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డిలతో కలిసి ఆమె ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై భగవంతుని కృపకు పాత్రులు కావాలని చైర్‌పర్సన్ కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొండలాచర్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం: సీపీఐ



మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

నాగోలు: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య విమర్శించారు. గురువారం నాగోలు డివిజన్ బండ్లగూడలోని గిరి ప్రసాద్ భవన్‌లో రంగారెడ్డి అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిచారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ, నరేంద్ర మోదీ అధికారంలో వచ్చాక శాస్త్రీయ విద్యా విధానాన్ని మార్చివేసి మతపరమైన అంశాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చి సమాజానికి ఉపయోగపడని భావజాలాన్ని పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. ఈ శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ అర్థం చేసుకొని రాబోయే కాలంలో విద్యార్థి పోరాటాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్. రవీంద్ర చారి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, సభ్యుడు యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సామిడి శేఖర్ రెడ్డి సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారెడ్డికి సత్కారం

సైదాబాద్: రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిన్నారెడ్డిని నాయకులు సన్మానించారు. గురువారం ఆయనను గాంధీభవన్‌లో పార్టీ నాయకులతో కలిసిన టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, పార్టీ పటిష్టతకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు అందరికీ ప్రభుత్వంలో తప్పనిసరిగా తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మామిడి కృష్ణకుమార్, యాకుత్‌పురా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ కార్యదర్శి కోట్ల లడ్డూపటేల్ పాల్గొన్నారు.



చిన్నారెడ్డిని సత్కరిస్తున్న టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్

ఎన్టీఆర్‌నగర్‌లోని పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్టీఆర్‌నగర్ బస్తీవాసులు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజవర్గం ఎన్టీఆర్ నగర్ బస్తీలోని పేదల ఇళ్లను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని ద అర్బన్ హట్స్, స్లమ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ జంట నగరాల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బస్తీవాసులతో కలిసి గురువారం ఎన్టీఆర్‌నగర్ చింతల చెట్ల వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడుతూ, ఎన్టీఆర్‌నగర్ సర్వే నంబర్ 9/1లో దాదాపు 45 ఎకరాలలో 1986 నుంచి 3 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. తమ ఇళ్ల పట్టాలను రెగ్యులర్ చేస్తామని రాజకీయ పార్టీలు దశాబ్దాలుగా ఇస్తున్న హామీలు ఇప్పటి వరకూ నెరవేర్చలేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్టీఆర్‌నగర్‌కు వచ్చిన మాజీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ తమ ఇళ్లను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి ఊరుకున్నారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్టీఆర్ నగర్‌లోని తమ ఇళ్ల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని పేదలు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బస్తీవాసులు సామల చంద్రయ్య, శంకర్ మహారాజు, పోచయ్య, యాదయ్య, మమ్మద్ ఆజీమ్, చింతల శోభరాణి, ఎండీ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్టాప్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఏ-వన్ టీ కంపెనీ 11వ బ్రాంచిని గురువారం నిర్వాహకులు రఫియా పటేల్ ప్రారంభించారు. చిత్రంలో కంపెనీ డైరెక్టర్లు జకి పటేల్, జాకిర్ పటేల్ ఉన్నారు.

- సాక్షి, సిటీబ్యూరో